సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 6 | సెప్టెంబర్ | 2023



ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

మహిళా ఫిర్యాదులపై వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. - 8లో▸



ఉత్సాహంగా నెట్‌బాల్ ఎంపికలు

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా కొనసాగాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28.5^0/23.6^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిర్వాసితులకు న్యాయం చేస్తాం



మల్హర్: ఆర్అండ్ఆర్ నిర్వాసితులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్లాట్ల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. మంగళవారం అదనపు కలెక్టర్ మల్హర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏఎమ్మార్ అధికారులు, నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నిర్వాసితులు పేర్లు, సెల్ నంబర్లతో సహా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జెన్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎమ్మార్ అధికారులు మల్లేష్, మూర్తి, ఆర్ఐ సరిత, నిర్వాసితుడు మధుసూదన్ పాల్గొన్నారు.

నారాయణమూర్తిని కలిసిన నాయకులు



టేకుమట్ల: హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గృహానికి మంగళవారం విప్లవ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి రాగా ఆయనను బీఆర్ఎస్ టేకుమట్ల మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు కత్తి సంపత్‌గౌడ్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, సర్పంచ్‌లు వెలిశెట్టి సురేష్, గునిగంటి మహేందర్, చింతలపెల్లి స్వామిరావు, నేరేళ్ళ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వంగ రాంబాబు ఉన్నారు.

ఐసీటీసీ తనిఖీ



మహదేవపూర్: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఎయిడ్స్ సమీకృత సలహా కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ పరీక్షలు పెంచి రోగులను గుర్తించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం అధికారి సురేందర్, ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై రాయితీ

భూపాలపల్లి రూరల్: జిల్లాలో ఉద్యానవన పంటలు సాగుకు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 130 హెక్టార్ల సాగుకు అనుమతులు వచ్చాయన్నారు. ఆసక్తి గల రైతులు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 79977 25102, 79977 25294 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలి



భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 7న మండలకేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బందు సాయిలు మాట్లాడుతూ కేంద్రం పెంచిన అధిక ధరలను అరికట్టాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, ఉపాధి కల్పన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశాడన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, కిరోసిన్, నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవికుమార్, వెలిశెట్టి రాజయ్య, సురేష్, సుజాత, స్వర్ణ, రాజీ, అనూష, సారయ్య, రాజశేఖర్, పున్నం పాల్గొన్నారు.

అయ్యో దేవుడా..!

ముగ్గురిని కబలించిన పిడుగుపాటు

- మృతుల్లో ఇద్దరు మహిళా కూలీలు, కౌలు రైతు
- చిట్యాల, కాటారం మండలాల్లో విషాదం

రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు వారివి.. నెలరోజులుగా వర్షాలు లేకపోవడంతో పనులు లేక ఇబ్బందులు పడ్డ కూలీలు.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉపాధి దొరుకుతుందనే ఆశతో వ్యవసాయ పనులకు వెళ్లారు. క్షణకాలంలో జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగు రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరు మహిళా కూలీలతో పాటు కౌలు రైతును ఈ లోకానికి శాశ్వతంగా దూరం చేసింది. ఈ ఘటన కళ్లముందే జరగడంతో వారి కుటుంబ సభ్యులు తల్లడిల్లిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఒంటరిచేసి వెళ్లిపోయావా అంటూ మహిళా కూలీల మృతదేహాలపై పడి వారి కుటుంబసభ్యులు రోదించారు. కాటారం, చిట్యాల మండలాల్లో మంగళవారం జరిగిన పిడుగుపాటు ఘటనలు జిల్లాలో విషాదం నింపాయి.

- చిట్యాల/కాటారం

కూలీ పనులే ఆధారంగా..

చిట్యాల మండల కేంద్రానికి చెందిన కూలీలు చిలువేరు సరిత(35), నేర్పాటి మమత(32), ఆరెపల్లి కొంరమ్మ, కుమార్, పర్లపెల్లి భద్రమ్మ, మైదం ఉమ మంగళవారం శాంతినగర్ శివారులోని ఆరెపల్లి పెద్ద సమ్మయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో మిరపనారు నాటేందుకు వెళ్లారు. మధ్యాహ్నం వర్షం రావడంతో పక్కనే ఉన్న వేప చెట్టు కిందికి చిలువేరి సరిత, నేర్పాటి మమత, పర్లపెల్లి భద్రమ్మ, మైదం ఉమ వెళ్లారు. చెట్టుపై పిడుగు పడడంతో చిలువేరి సరిత, నేర్పాటి మమత అక్కడికక్కడే మృతిచెందారు. పర్లపెల్లి భద్రమ్మ, మైదం ఉమకు తీవ్ర గాయాలు కాగా పక్కనే ఉన్న సమ్మయ్య, కొమురమ్మ, కుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. భద్రమ్మ, ఉమలను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చిట్యాల రెండవ ఎస్సై షాఖాన్ ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

భార్య కళ్లదుటే..

కాటారం మండలం దామెరకుంటకు చెందిన గూడూరి రాజేశ్వరరావు(46) 20 సంవత్సరాలుగా వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. కుమార్తె పెళ్లి సమయంలో నాలుగు ఎకరాల సొంత భూమిని అమ్మాడు. గ్రామంలో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. రాజేశ్వర్‌రావు భార్య సునీత, మరో ఇద్దరు కూలీలను వెంట పెట్టుకొని మంగళవారం పొలంలో కలుపు తీయడం కోసం వెళ్లాడు. సునీత, ఇద్దరు కూలీలు కలుపు తీస్తుండగా రాజేశ్వరరావు పొలంగట్టుపై నిల్చొన్నాడు. ఒక్కసారిగా రాజేశ్వర్‌రావుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. క్షణకాలంలోనే జరిగిన ఈ ఘటనను కళ్లారా చూసిన భార్య సునీత సొమ్మసిల్లి పొలంలోనే పడిపోయి స్వల్ప అస్వస్థతకు గురైంది. చుట్టు పక్కల రైతులు వచ్చి చేసేసరికే రాజేశ్వరరావు శరీరం అక్కడక్కడ కాలిపోయి నిర్జీవంగా పడిపోయి ఉన్నాడు. కుమారుడు శ్రీనివాస్ జిల్లా కేంద్రంలో మొబైల్ షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. రాజేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



సరిత మృతదేహంపై పడి రోదిస్తున్న భర్త



రాజేశ్వరరావు మృతదేహం



గాయపడ్డ భద్రమ్మను ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

కూలీకి పోకుంటే బతికేది..

పనికి పోకుంటే నా భార్య బతికేదని సరిత మృతదేహంపై పడి ఆమె భర్త తిరుపతి రోదించడం కంటతడి పెట్టించింది. తిరుపతి జీతం ఉంటూ జీవనం సాగిస్తుండగా సరిత కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా కుమార్తెల వివాహాలు అయ్యాయి.

బతుకుదెరువు కోసం వచ్చి..

మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన నేర్పాటి మమత తన భర్తతో కలిసి తల్లిగారి ఊరైన చిట్యాలలో బతుకుదెరువు కోసం వచ్చింది. కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మంగళవారం మమత మిరపనారు నాటేందుకు వెళ్లి మృతిచెందింది. సొంత ఊళ్లో ఉంటే బతికేటోళ్లం అంటూ ఆమె భర్త అశోక్ రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి సత్యవతిరాథోడ్



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి

మహబూబాబాద్: భారీ వర్షాల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సత్యవతిరాథోడ్ అదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి సత్యవతిరాథోడ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో మండల, గ్రామ స్థాయిలో ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. చెరువులు, జలాశయాల నీటమట్టం పరిశీలించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత, శిథిలావస్థ ఇళ్లల్లో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు చేరిన ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

విస్తారంగా వర్షాలు

భూపాలపల్లి రూరల్: ఆగస్టు నెల మొత్తంగా ముఖం చాటేసిన వర్షాలు మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మహాముత్తారం మండలంలో భారీ వర్షం నమోదైంది. భూపాలపల్లి మండలంలోని భీంఘన్‌పూర్ చెరువు 18 అడుగుల సామర్థ్యానికి గాను 18 అడుగులు, గణపురం మండలంలోని గణపురం చెరువు 30అడుగుల సామర్థ్యానికి గాను 30 అడుగులకు చేరింది. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే మత్తళ్లు పడనున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు మిరప మొక్కలు నాటుతున్నారు.

వర్షపాతం వివరాలు.. (మి.మీ)

మండలం	సెప్టెంబర్ 4	సెప్టెంబర్ 5
మహదేవపూర్	78.2	15.4
పలిమెల	79.8	3.8
మహాముత్తారం	84.2	4.6
కాటారం	53.0	8.2
మల్హర్	86.6	21.10
చిట్యాల	47.0	58.6
టేకుమట్ల	33.4	63.2
మొగుళ్లపల్లి	37.2	40.8
రేగొండ	39.4	10.4
గణపురం	68.2	11.4
భూపాలపల్లి	55.8	13.6

పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి: జిల్లా సమీకృత కలెక్టరేట్, మెడికల్ కళాశాల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం ఆయా భవనాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... కలెక్టరేట్ భవన ఆవరణలో సుందరీకరణ పనులను పూర్తి చేయాలన్నారు. అదనపు కార్మికులను ఏర్పాటు చేసుకొని మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం మెడికల్ కళాశాలలో ప్రవేశం పొందిన వరంగల్‌కు చెందిన విద్యార్థిని సుదీక్షకు కలెక్టర్ అడ్మిషన్ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజు దేవ్ డే, అధ్యాపకులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



సుదీక్షకు అడ్మిషన్ పత్రం అందజేస్తున్న కలెక్టర్

రూ.187.75కోట్ల రుణమాఫీ

జిల్లాలో ఇప్పటివరకు 34,115 మంది రైతులకు రూ.187.75 కోట్ల రుణమాఫీ జరిగినట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 50,436 మంది రైతులకు రూ.262.38 కోట్ల రుణమాఫీ ఈ నెలాఖరు వరకు జరుగుతుందని వెల్లడించారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కంపేటి రాజయ్య, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆశాలకు నెలకు రూ.18వేల వేతనం అమలు చేయాలన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విగ్రహాలతో పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు. భక్తుల కోలాట ఆట పాటల నడుమ భక్తి శ్రద్ధలతో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి, భక్తులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌లో ఊరేగింపు చేస్తున్న నిర్వాహకులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



భూపాలపల్లి: నియోజకవర్గ పరిధిలోని గిరిజన ఆవాస గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.26.39కోట్ల నిధులు మంజూరు చేసింది. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఇటీవల రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్‌ను కోరారు. ఈ మేరకు మంత్రి గిరిజన ఆవాస గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేశారు. భూపాలపల్లి మండలం రాంపూర్ నుంచి చికెన్‌పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటి 85 లక్షలు, రాజీవ్‌నగర్ ఆర్అండ్‌బీ రోడ్ నుంచి పంబాపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3కోట్ల 60 లక్షలు, దూదేకులపల్లి నుంచి దొనికెలమడుగు వరకు బీటీ రోడ్డు కోసం రూ.కోటి 80 లక్షలు, నాగారం గ్రామం నుంచి మీనాజీపేట, మరియు గొల్లబుద్ధారం తండా నుంచి రాజునాయక్ కుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3కోట్ల 60 లక్షలు, నాగారం గ్రామం నుంచి కిష్టాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటి 89 లక్షలు, చిట్యాల మండలం గుంటూరుపల్లి నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటి 80 లక్షలు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి లక్ష్మీపురం తండా వరకు బీటీ రోడ్డు కోసం రూ.కోటి 80 లక్షలు, శాయంపేట మండలం కొప్పుల గ్రామం నుంచి పరకాల ఎన్‌హెచ్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.5కోట్ల 80 లక్షలు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సూర్యహార్ గ్రామానికి, కాట్రపల్లి గ్రామం నుంచి రాజుపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2కోట్లు, శాయంపేట మండలం నూర్జాన్‌పల్లి నుంచి వసంతాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2కోట్ల 20 లక్షలు మంజూరు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు మంత్రి సత్యవతిరాథోడ్‌కు ఎమ్మెల్యే గండ్ర కృతజ్ఞతలు తెలిపారు.

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్

కాటారం: నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని.. జీవితంలో స్థిరపడాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. తొమ్మిది కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నిరుద్యోగుల విద్యార్హత, స్కిల్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 156మంది నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాకు హాజరుకాగా 123మందికి పలు కంపెనీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ సందర్భంగా పీఓ అంకిత్ మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేయకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నించాలని సూచించారు. పట్టుదలతో శ్రమిస్తే ప్రతీది సాధ్యమవుతుందని.. యువత లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకెళ్లాలన్నారు. ముందుగా ఒక ఉదోగంలో చేరితే అనుభవం వస్తుందని.. దానితో ఎన్నో ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు. జీవితంలో అనేక అవకాశాలు వస్తాయని వాటిని చేజార్చుకోకూడదని అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 15 జాబ్‌మేళాల ద్వారా 2వేల మంది గిరిజన నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పీఓ తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ఐటీడీఏ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పీఓ చేతుల మీదుగా ఆర్డర్ కాపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, జేడీఎం కొండలరావు, డీపీఎం సతీశ్, లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్, జేఆర్పీలు రాజ్‌కుమార్, శివ, పాపారావు, ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి, పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న పీఓ అంకిత్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

భూపాలపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సీఎస్ సూచించారు. అనంతరం కలెక్టర్ భవేష్ మిశ్రా జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేస్తూ, పరిస్థితులను ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ విభాగాలకు చెందిన ఇంజనీర్లు సంబంధిత తహసీల్దార్లతో అందుబాటులో ఉండాలని చెప్పారు. ఇరిగేషన్ ఏఈలకు వారి వారి పరిధిలోని చెరువులు, కుంటలు, నీటి వనరులపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ప్రమాదానికి ఆస్కారం ఉన్న చోట రహదారిని మూసివేయాలని, రాకపోకలు జరపకుండా భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదమున్న చెరువుల వద్ద ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వర్షంలో చేపలు పట్టేందుకు మత్స్యకారులు వెళ్లవద్దని చెప్పారు. ముంపు ప్రాంతాలను పర్యవేక్షించాలని, వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. అధికారులు ప్రధాన కార్యస్థానంలోనే ఉంటూ, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలు, పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లపై, కల్వర్టులపై నీరు ప్రవహించే ప్రాంతాల్లో రవాణా నిషేధించాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్ పరిశీలన

మహాముత్తారం: కనుకునూర్ గ్రామంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ పార్థివిశా పరిశీలించారు. రికార్డులను పరిశీలించి వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం వైద్యాధికారి సందీప్, జిల్లా క్వాలిటీ మేనేజర్ భానుకుమార్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఉమాదేవి, డీపీఓ చిరంజీవి, జిల్లా ఎపిడలమిస్ట్ భాష్యనాయక్, ఏఎన్ఎం సూర్యకళ, భూలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శివకుమార్

ఉపాధ్యాయుల శ్రమ వెలకట్టలేనిది..

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులను ఉత్తములుగా తయారుచేసే ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని వారి శ్రమ వెలకట్టలేనిదని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లాకేంద్రంలోని ఇల్లంద్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 35 మందిని శాలువా, పూలమాల, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉందని.. అన్ని రంగాల్లో పురోగామి రాణిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో గతేడాది జిల్లా 5వ స్థానంలో రావడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది మొదటి స్థానంలో నిలిపాలని సూచించారు. భూపాలపల్లి జిల్లా పేరు ప్రఖ్యాతలు రాష్ట్ర స్థాయిలో నిలిపేందుకు ఉపాధ్యాయులు మరింత శ్రమించాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఎంచుకునే రంగాలను గుర్తించి వారికి అవగాహన కల్పించేందుకు ఇప్పటి నుంచే మోటివేషన్ తరగతులు నిర్వహించాలని కోరారు. మన ఊరు -మనబడి ద్వారా పాఠశాలల్లో రూపరేఖలు మారుతున్నాయని, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉండేందుకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్, ఏఎంఓ లక్ష్మణ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ట్రస్మా నాయకులు సాంబయ్య, శ్రీనివాస్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే గండ్ర, బుర్ర రమేష్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మహిళా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

● రౌడీ షీటర్లపై నిఘా పెంచాలి ● వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : మహిళా ఫిర్యాదులపై వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులతో కేయూ సెనేట్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, అరెస్టులు, బెయిల్ మంజూరు, తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఈనెల 9న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా స్టేషన్ అధికారులు కృషి చేయాలన్నారు. నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాఖ కీర్తి ప్రతిష్టలకు మచ్చ తీసుకొచ్చేలా పోలీస్ అధికారులు వ్యవహరించొద్దని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ వారీగా మూడు సంవత్సరాల క్రితం ఆస్తి నేరాలకు పాల్పడిన నేరస్తుల ప్రస్తుత స్థితిగతులను విచారించాలని, అలాగే రౌడీ షీటర్ల వ్యవహార శైలిపై కూడా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. పోలీస్‌స్టేషన్ వారీగా గుర్తించిన నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీలు మురళీధర్, రవీందర్, సీతారాం, ట్రైనీ ఐపీఎస్ అంకిత్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్టీసీ ప్రయాణమే ఇష్టం

● జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ



విజేతలను ప్రకటిస్తున్న జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ, ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం జాస్తి శ్రీలత

హన్మకొండ : మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడానికి ఇష్టపడుతారని, మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటారని హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా టీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీమ్ విజేతల ఎంపిక కార్యక్రమానికి మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలతతో కలిసి డ్రా తీసి విజేతలను ప్రకటించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ ఈనెల 8న హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో జరిగే కార్యక్రమంలో లక్కీ డ్రా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. విజేతలు హైదరాబాద్ వెళ్లేందుకు ఉచి త ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. లక్కీ డ్రాలో హనుమకొండకు చెందిన పి.శ్వేత ప్రథమ బహుమతి కింద రూ.25 వేలు, జనగామకు చెందిన చిర్ర ఉమారాణి ద్వితీయ బహుమతి రూ.15 వేలు, హనుమకొండకు చెందిన ధరావత్ కమల తృతీయ బహుమతి కింద రూ.10 వేలు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కేశరాజు భానుకిరణ్, జి.మాధవరావు, అకౌంట్స్ ఆఫీసర్ ఆర్.లావణ్య, పర్సనల్ ఆఫీసర్ డి.శ్రీహరి, డిపో మేనేజర్లు వెంకటేశం, ధరం సింగ్, సురేష్ పాల్గొన్నారు.

వరంగల్ గొప్ప పర్యాటక ప్రాంతం

● బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్

హన్మకొండ: వరంగల్ గొప్ప చారిత్రక పర్యాటక ప్రాంతమని, తాను ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నానని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిశారు. ఈ సందర్భంగా తాను ఉమ్మడి జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నానని, తనను అవి మంత్ర ముగ్ధుడిని చేశాయని మంత్రికి చెప్పారు. మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గంలో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి వంటి చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, ఆ ప్రాంతాలను కూడా సందర్శించాలని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్‌ను మంత్రి ఎర్రబెల్లి సన్మానించారు.

అంకితభావానికి అవార్డు..

అంకితభావంతో నాణ్యమైన, వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేపడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు లభించాయి. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, తదితరులు.. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డు అందజేసి సన్మానించారు.



మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై. మనోహర్ రెడ్డి

యూనివర్సిటీ అధ్యాపకుల విభాగంలో..



ప్రొఫెసర్ మనోహర్, హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్, కేయూ

లైబ్రేరియన్ విభాగంలో..



ఆర్. కుమారస్వామి, లైబ్రేరియన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సంపేట

డిగ్రీ కళాశాల అధ్యాపకుల విభాగంలో



రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్ పింగిళి డిగ్రీ కళాశాల హనుమకొండ



లింగారెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ కళాశాల హనుమకొండ



సమ్మయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగు



రాంబాబు,అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ కళాశాల హనుమకొండ

ఎస్‌ఏ/పీజీటీ/టీజీటీ(హైస్కూల్స్) విభాగంలో..



సుతారి సురేశ్, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్, బుధరావుపేట, ఖానాపురం



శ్రీధరాచార్యులు, ఎస్‌ఏ తెలుగు, జీహెచ్ఎస్ మాసుం అలీ, వరంగల్

ఎస్‌జీటీ విభాగంలో..



లింగమూర్తి, జామతండా నెల్లికుదురు మండలం మహబూబాబాద్ జిల్లా



రమేశ్, నర్సింహులగూడెం, కేసముద్రం మండలం, మహబూబాబాద్

స్పెషల్ కేటగిరీలో..



అరుంధతి, ఎస్‌ఏ బయో సైన్స్, జెడ్పీహెచ్ఎస్ నెల్లుట్ల, లింగాలఘనపురం, జనగామ



కూరపాటి సుశీల, ఎస్‌ఏ తెలుగు, జెడ్పీహెచ్ఎస్ దుగ్గొండి, వరంగల్ జిల్లా



ఆర్.శ్రీధర్, ఎస్‌ఏ మ్యాథ్స్, జెడ్పీహెచ్ఎస్ కంభంపల్లి, మహబూబాబాద్



ఎ.అంజయ్య, ఎస్‌జీటీ, ప్రాథమిక పాఠశాల దేవరుప్పుల, జనగామ జిల్లా

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విభాగంలో..



రాపోల్ ప్రభాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల దేవరుప్పుల, జనగామ జిల్లా

తోటి ఉద్యోగులు మోసం చేశారని..

● రైల్వే ఉద్యోగి ఆత్మహత్య
● కాజీపేటలో ఘటన



చనిపోయే ముందు సెల్ఫీ వీడియోలో రవికుమార్



కాజీపేట ఎలక్ట్రిక్ షెడ్ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

కాజీపేట: తోటి ఉద్యోగులు చేసిన మోసాన్ని జీర్ణించుకోలేక ఓ రైల్వే ఉద్యోగి సూసైడ్‌నోట్‌తోపాటు సెల్ఫీ వీడియో తీసిపురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో మంగళవారం జరిగింది. రైల్వే అధికారులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన పులి రవికుమార్ (41) అనే వ్యక్తి తండ్రి ఉద్యోగాన్ని వారసత్వంగా పొంది దాదాపు 12 ఏళ్లుగా రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో టెక్నీషియన్-3గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం తనతో కలిసి పనిచేసే మహిళ ఉద్యోగి ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకోగా సదరు ఉద్యోగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారులు విచారించి రవికుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. కాగా, రవికుమార్ వద్ద ఆ మహిళ కుటుంబ అవసరాల పేరుతో రూ.2.80 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వడం లేదనే విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్లు మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనతో కలిసి పనిచేస్తున్న మహిళతోపాటు విఠల్‌రావు అనే ఉద్యోగి వైఖరి కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా సెల్ఫీ వీడియోతోపాటు సూసైడ్ నోటు రాసి పురుగుల మందు తాగి ఎలక్ట్రికల్ షెడ్‌లోనే ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు....

రవికుమార్ సూసైడ్ నోటు ఆధారంగా నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధుమిత్రులు ఎలక్ట్రికల్ లోక్ షెడ్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీనియర్ డీఈ కృష్ణ సాయి ప్రశాంత్, సీఐలు సార్ల రాజు, సంజీవరావు, వేల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సంధ్య తదితరులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ రాజు తెలిపారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష..

వరంగల్ లీగల్ : మద్యం సేవించొద్దని చెప్పిన భార్యను కొట్టి చంపిన అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించడానికి మృతదేహాన్ని బావిలో పడేసిన నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణగౌడ్ కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఆరెపల్లికి చెందిన లచ్చవ్వతో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లి గ్రామానికి చెందిన ఆవుల రమేశ్‌కు ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూలీ పని చేస్తూ జీవించే రమేశ్.. మద్యానికి బానిసై వచ్చిన డబ్బులు తాగడానికే ఉపయోగించేవాడు. దీనిపై దంపతులకు గొడవలు జరుగగా ఇరు కుటుంబాల పెద్దలు పలుమార్లు పంచాయితీలు నిర్వహించినా రమేశ్ ప్రవర్తనలో మార్పు లేదు. ఈ క్రమంలో బతుకుదెరువు కోసం దంపతులు వేలేరు మండలం పీచర గ్రామంలోని ఓ కోళ్లఫాంలో పని చేయడానికి వచ్చారు. 2022 అక్టోబర్ 29న మద్యం సేవించడానికి డబ్బులు లేకపోవడంతో రమేశ్ ఇంట్లో ఉన్న బియ్యం విక్రయించాడు. దీనిపై లచ్చవ్వ భర్తను ప్రశ్నించగా గొడవ జరిగింది. దీంతో ఆమె కోళ్లఫాం యజమానికి విషయం చెప్పింది. ఆగ్రహం చెందిన రమేశ్ తన భార్యను ఇష్టానుసారంగా కొట్టడంతో స్పృహ తప్పింది. చనిపోయిందనుకుని నిర్ధారించుకున్న రమేశ్.. తన భార్య ఆత్మహత్య చేసుకుందని నమ్మించడానికి ఆమె మృతదేహాన్ని కోళ్ల ఫాంలో ఉన్న బావిలో పడేశాడు. యజమాని, బంధువులకు ఫోన్ చేసి లచ్చవ్వ ఆత్మహత్య చేసుకుందని తెలిపాడు. అనుమానం వచ్చిన లచ్చవ్వ తండ్రి పీచర పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్య కేసుగా నమోదు చేసి రమేశ్‌ను అరెస్ట్ చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో రమేశ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ జడ్జి కృష్ణమూర్తి తీర్పు వెల్లడించారు. పోలీసు అధికారులు రమేశ్ కేసును పరిశోధించగా లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, భీంరెడ్డి విచారణ పర్యవేక్షించారు. సాక్షులను కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్ కోర్టులో ప్రవేశపెట్టారు.

తల్లి మందలించిందని..

● పురుగుల మందు తాగిన బాలిక
● చికిత్స పొందుతూ మృతి



వర్షిత (ఫైల్)

మరిపెడ రూరల్: తల్లి మందలించిందనే కారణంతో మనస్తాపం చెందిన ఓ బాలిక.. పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం జీపీ పరిధిలోని జీన్య తండాలో జరిగింది. తండాకు చెందిన గుగులోత్ దూబ్‌సింగ్, వినోద దంపతుల కూతురు వర్షిత (10) తండాలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. తోటి పిల్లలతో కలిసి ఆడుకోవడానికి వెళ్లింది. చాలా సమయం తర్వాత ఇంటికి వచ్చిన బాలికను తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక.. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. చిన్న వయసులోనే నూరేళ్లు నిండాయా బిడ్డా అంటూ తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

పాముకాటుతో మహిళ మృతి



నాగమణి (ఫైల్)

ఏటూరునాగారం: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన బీర్ల నాగమణి (40) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం మరో ఇద్దరు మహిళలతో కలిసి సమీప అడవిలోకి బోడకాకరకాలకు వెళ్లింది. కాయలు కోస్తుండగా పాముకాటు వేసింది. ఇది గమనించి ఇద్దరు మహిళలు.. నాగమణిని ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ములుగు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని భర్త మలయ్య తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

లైంగిక వేధింపులు.. వివాహిత బలవన్మరణం

ములుగు రూరల్: లైంగిక వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ములుగు మండలం శ్రీనగర్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కృష్ణవేణి (37)ని దేవనగర్ జీపీ మల్లారెడ్డిపల్లికి చెందిన అడిదెల తరుణ్‌రెడ్డి కొంత కాలంగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమెకు తరచూ ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో ఈ విషయం కృష్ణవేణి తన తల్లికి తెలియజేసింది. అయినా తరుణ్‌రెడ్డి తీరు మారలేదు. రోజురోజుకూ తరుణ్‌రెడ్డి వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక మనస్తాపానికి గురైన కృష్ణవేణి.. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలు తల్లి అలుగోజు రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెండో ఎస్సై రామకృష్ణ తెలిపారు. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలు





ధ్వంసమైన కంప్యూటర్ మానిటర్, విద్యార్థి సంఘాల బాధ్యులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

● రద్దు చేయాలని ఏబీవీపీ, బీసీ విద్యార్థి సంఘాల డిమాండ్
● ప్రిన్సిపాల్ ఆఫీస్ వద్ద ఆందోళన.. కంప్యూటర్, కుర్చీలు, అద్దం ధ్వంసం
● విద్యార్థి సంఘాల బాధ్యుల అరెస్ట్.. కేయూలో ఉద్రిక్తత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవతకవలకు జరిగాయని ఆరోపిస్తూ ఆ ప్రవేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు మంగళవారం క్యాంపస్‌లోని యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తొలుత ప్రిన్సిపాల్ కార్యాలయంలోని ఉద్యోగులను బయటకు పంపించారు. పీహెచ్‌డీ ప్రవేశాల్లో సీట్లు పొందిన అభ్యర్థులు జాయినింగ్ రిపోర్టు ఇచ్చేందుకు రాగా ఈ ఆందోళనతో వారు కార్యాలయ ఆవరణ, వివిధ చోట్ల నిరీక్షించారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో యూనివర్సిటీ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వివిధ విభాగాల్లో పార్ట్‌టైం అభ్యర్థులకే ఎక్కువ సీట్లు వచ్చాయని తెలిపారు. వీసీ కనుసన్నల్లోనే అక్రమాలు జరిగాయని, అడ్మిషన్లు రద్దుచేసి పారదర్శకంగా జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న కేయూ ఎస్సైలు సురేష్, విజయ్‌కుమార్..సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహంతో కొందరు విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్సిపాల్ ఆఫీస్‌లోని కంప్యూటర్, అద్దాలు, కుర్చీని పగలగొట్టారు. మరోగదిలో మానిటర్, ప్రింటర్‌ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాచర్ల రాంబాబు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అంబాల కిరణ్, నాయకుడు ప్రశాంత్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు, మరో ఇద్దరు అంకిల శంకర్, మట్టెడకుమార్‌ను అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు. దీంతో క్యాంపస్‌లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి.

9 మంది కేసు

కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవతకవలకు జరిగాయని, ఆయా అడ్మిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రిన్సిపాల్ ఆఫీస్ వద్ద వివిధ విద్యార్థి సంఘాల ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ ఎంపికలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మెన్ అండ్ ఉమెన్ నెట్‌బాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. వరంగల్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలకు ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో పాటు ఇష్టమైన క్రీడల్లో ప్రతిభ కనబరిచాలని సూచించారు. కాగా, ఈ ఎంపికలకు 80మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యారావు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 9,10,11 తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి లిల్లీ ఫ్లోరెన్స్, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాము తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా నాలుగు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు



కాజీపేట రూరల్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా నాలుగు వారాంతపు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఈ రైళ్ల సర్వీస్‌లు సెప్టెంబర్ 3 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నడుస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల సమయ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. -సికింద్రాబాద్-మచిలీపట్నం (07186) వీక్లి ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం అర్ధరాత్రి 12. 55 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. అదేవిధంగా మచిలీపట్నం-సికింద్రాబాద్ (07185) వీక్లి ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లకు సికింద్రాబాద్-మచిలీపట్నం మధ్య కాజీపేట, వరంగల్, డోర్నకల్, ఖమ్మం, విజ యవాడ, గుడివాడ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు. అదే విధంగా సికింద్రాబాద్-తిరుపతి (07 482) వీక్లి ఎక్స్‌ప్రెస్ ప్రతి సో మవారం రాత్రి 7.30 గంటలకు కాజీ పేట జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరుపతి-సికింద్రాబాద్ (07481) వీక్లి ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం ఉదయం 6.50 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. ఈ రెండు రైళ్ల సర్వీస్‌లకు సికింద్రాబాద్-తిరుపతి మధ్య జనగామ, కాజీపేట, వరంగల్, మానుకోట, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెలూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

కాంగ్రెస్‌లో వాల్‌పోస్టర్ల కలకలం

● డీసీసీ అధ్యక్షుడు నాయినిని బహిష్కరించాలని నినాదాలు
● వాల్‌పోస్టర్లు అంటించింది నేనే.. మూరతోటి అనిల్‌కుమార్
● సీపీకి ఫిర్యాదు చేశా.. నాయిని రాజేందర్‌రెడ్డి



రాజేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా వెలిసిన వాల్‌పోస్టర్

హన్మకొండ చౌరస్తా : కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పార్టీకి పట్టిన చీడపురుగు.. ఆయనను పార్టీ నుంచి బహిష్కరించాలనే నినాదాలతో మంగళవారం వెలిసిన వాల్‌పోస్టర్లు వరంగల్ పశ్చిమ కాంగ్రెస్‌లో కలకలం సృష్టించాయి. మేల్కొన్న నాయిని వర్గీయులు ఉదయమే వాల్‌పోస్టర్లను తొలగించినప్పటికీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. కాగా, పోస్టర్లను అంటించింది తానేనని జులైవాడకు చెందిన మూరతోటి అనిల్‌కుమార్ తెలిపారు. మాజీ మంత్రి హయగ్రీవాచారి శిష్యుడిగా 45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నా.. కార్పొరేషన్ ఎన్నికల్లో తనను కాదని రాజేందర్‌రెడ్డి అనర్హుడికి టికెట్ అమ్ముకున్నాడని, పోస్టర్లను తొలగిస్తే పోరాటాన్ని ఆపేది లేదని అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. ఆటోలకు అంటించి, కరపత్రాలను పంచుతానని పేర్కొన్నారు.

సీపీకి ఫిర్యాదు చేశా..

ఈ విషయంపై డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా తన ప్రతిష్ఠకు భంగం కలిగించడంతోపాటు తప్పుడు ప్రచారం చేస్తూ, వాల్‌పోస్టర్లను అంటించిన అనిల్‌కుమార్‌పై సుబేదారి పోలీస్ స్టేషన్, పోలీస్ కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు టికెట్ వస్తుందనే అక్కసుతో కొందరు తమ పార్టీకి చెందిన నాయకులు, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఈ వ్యవహారం నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. అనిల్‌కుమార్ ఒక రౌడీషీటర్ అని, అలాంటి వ్యక్తిని అడ్డు పెట్టుకుని రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. తాను ప్రజల మద్దతుతో విజయం సాధిస్తానని నాయిని ధీమా వ్యక్తం చేశారు.